పోలీస్ కవాతు

ఎన్నికల నేపథ్యంలో మంగళ్‌హాట్ పోలీసులు కవాతు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ మహేశ్‌గౌడ్ నేతృత్వంలో 150 మంది సిబ్బంది మంగళ్‌హాట్, అల్లబండ, అప్పర్ ధూల్‌పేట్ తదితర ప్రాంతాల్లో కవాతు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 13 న ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్ఐలు అస్లం, అంబిక పాల్గొన్నారు. – అబిడ్స్

వందేండ్ల నుంచి కాంగ్రెస్ బీసీలను మోసం చేస్తున్నది

రవీంద్రభారతి, మే 9 : వంద సంవత్సరాల నుంచి బీసీలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తున్నదని, బీసీ వ్యతిరేక పార్టీ కాంగ్రెస్‌ను మే 13న జరిగే ఎన్నికలో ఓటుతో గుణ పాఠం చెప్పాలని ఆల్ ఇండియా వెనుకబడిన ప్రజల సునామి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సికింద్రాబాద్ అభ్యర్థి సీహెచ్ భూపాల్‌గౌడ్ విమర్శించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీలకు న్యాయం చేయడంలో న్యాయవ్యవస్థ విఫలమైందని, ఒకప్పటి చీఫ్ జస్టిస్ ప్రభాకర్ మిశ్రా అవినీతిని అంగీకరించారని భూపాల్‌గౌడ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అవినీతిలో కూరుకుపోయిందని, దేశ సంపద పూర్తిగా కాంగ్రెస్ నాయకులు దోచుకున్నారని అన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు.

బీజేపీ ప్రచారం..

అడిక్‌మెట్ డివిజన్ సాయిచరణ్ కాలనీలో బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ.. ఆ పార్టీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు గానుగపాటి సూర్యనారాయణ శర్మ, సుబ్రమణ్యం బాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. – ముషీరాబాద్, మే 9

కాంగ్రెస్ వచ్చాకే ప్రజలకు కష్టాలు

- పద్మారావుకు మద్దతుగా రాంనగర్‌లో ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రచారం

ముషీరాబాద్, మే 9: త్వరలో జరుగనున్న పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంటు స్థానాన్ని కైవసం చేసుకోబోతుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు భారీ మెజార్టీతో విజయం సాధించబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన అడిక్‌మెట్ డివిజన్ రాంనగర్, ముషీరాబాద్ డివిజన్ వైఎస్ఆర్ పార్కు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తూ పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి బీఆర్ఎస్‌కు విశేష స్పందన వస్తుందని, పద్మారావుగౌడ్‌కు ముషీరాబాద్ నుంచి అధిక మెజారిటీ రాబోతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత నగరంలో ప్రజలకు తాగునీరు, కరెంటు, పెన్షన్ పంపిణీలో జాప్యం వంటి సమస్యలు అధికమయ్యాయని ఆరోపించారు. నాలుగైదు నెలలుగా రేవంత్‌రెడ్డి పాలనను చూస్తున్న ప్రజలు కేసీఆర్ పాలన మళ్లీ వస్తే బాగుండని భావిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జయసింహ, బి. శ్రీనివాస్‌రెడ్డి, ముచ్చకుర్తి ప్రభాకర్, మాధవ్, సురేందర్, రవియాదవ్, సయ్యద్ అస్లాం, నేత శ్రీను, వళ్లాల శ్రీనివాస్ యాదవ్, సుధాకర్, శ్యామ్‌సుందర్, బొట్టు శ్రీను, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రాంనగర్‌లో బీఆర్ఎస్ మహిళా కార్యకర్తలు నీలమ్మ, సంపూర్ణ, తులసీ తదితరులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



రాంనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నాయకులు

మెహిదీపట్నంలో..

మెహిదీపట్నం : మాజీ సీఎం కేసీఆర్ ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని, కాంగ్రెస్ పార్టీ మాత్రం ప్రజలను మోసం చేసిందని, లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని ఆ పార్టీ మెహిదీపట్నం డివిజన్ అధ్యక్షుడు మెట్టునట్ రాజ్ అన్నారు. గురువారం సంతోష్‌నగర్ కాలనీ పార్కులో బీఆర్ఎస్ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని వారు ప్రచారం నిర్వహించారు. మార్నింగ్ వాకర్స్‌ను కలిసి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

కార్యక్రమంలో నాయకులు చింతల అశోక్ ముదిరాజ్, యాద శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సంతోష్‌నగర్ కాలనీ పార్కులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మెట్టు నట్‌రాజ్, నాయకులు

బీఆర్ఎస్ ఓటింగ్ శాతం పెంచండి

- ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్‌రావు
- సికింద్రాబాద్‌లో పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని పిలుపు

నాంపల్లి నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్‌రావు

మెహిదీపట్నం మే 9 : లోక్‌సభ ఎన్నికలలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సికింద్రాబాద్ ఎంపీగా తీగుళ్ల పద్మారావుగౌడ్‌ను గెలిపించడానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్‌రావు అన్నారు. గురువారం నాంపల్లి నియోజకవర్గం ముఖ్యనాయకుల, కార్యకర్తల సమావేశాన్ని నియోజకవర్గం ఇన్‌చార్జి సీహెచ్ ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. సికింద్రాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి ప్రజల నుంచి అనూహ్యస్పందన వస్తుందని, లోక్‌సభ స్థానాన్ని తామే కైవసం చేసుకుంటున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఇన్ని రోజులు చేసిన కష్టానికి రెట్టింపుగా మరో మూడు రోజులు కష్టపడి మెజార్టీని నాంపల్లి నుంచి అందించాలని ఎమ్మెల్సీ ఎంఎస్ పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో కో-ఆర్డినేటర్ ప్రదీప్‌కుమార్ అగర్వాల్, నాయకులు అర్షద్ అలీ, అబ్దుల్ కలీం, అశ్విన్ మార్గం, చెన్నబత్ని లక్ష్మీనారాయణ, మెట్టునట్‌రాజ్, గోప అభిషేక్ రాజ్, జకీఉల్లా, హైమద్, వాల్మీకి తదితరులు పాల్గొన్నారు.

గోల్నాకలో కారు జోరు..

- కాచిగూడ, గోల్నాక డివిజన్లలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ప్రచారం

కాచిగూడ/ గోల్నాక, మే 9: ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజల ఛీ కొడుతున్నారని, బీఆర్ఎస్ పార్టీ బలం ముందు కాంగ్రెస్, బీజేపీ పార్టీలు నిలవడంలేవని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. గురువారం బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు మద్దతుగా శాంతినగర్, లక్ష్మీనగర్, తులసీనగర్ తదితర ప్రాంతాల్లో గోల్నాక మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మతో కలిసి ప్రచారాన్ని నిర్వహించారు. అంబర్‌పేట నియోజకవర్గంలో ప్రత్యర్థుల అంచనాలకు అందకుండా కారు దూసుకుపోతున్నదని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క హామీని కూడా అమలు చేయకపోవడంతో ప్రజలు కాంగ్రెస్ పార్టీపై అగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పథకాలను సద్వినియోగపరుచుకున్న లబ్ధిదారులందరూ బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో గండికోట జనార్దన్, గెల్వయ్య, ఆర్‌కే బాబు, రెడపాక రాము, భూపతి లక్ష్మణ్, భరత్‌రాజ్ ముదిరాజ్, కాలేరు రాజు, సంతోష్, పల్లవి స్థానికులు పాల్గొన్నారు.



ఆటోడ్రైవర్, ప్రయాణికులను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాకలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, బీఆర్ఎస్ మహిళా నాయకులు

పద్మారావుగౌడ్‌కు మద్దతుగా ప్రచారం

గోల్నాక : అంబర్‌పేట డివిజన్ పటేల్ బాడ, ప్రేమ్‌నగర్ తదితర ప్రాంతాల్లో సికింద్రాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి టి.పద్మారావుగౌడ్‌కు మద్దతుగా గురువారం స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తు ఓటు వేయాలని అభ్యర్థించారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ్ ముదిరాజ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గోల్నాక డివిజన్‌లో ప్రచారం చేస్తున్న మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ, మహిళా నేతలు

కాలేరు పద్మ ఆధ్వర్యంలో...

అదేవిధంగా గోల్నాక డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పద్మారావుగౌడ్‌కు మద్దతుగా గురువారం మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మహిళా నాయకులు పాల్గొన్నారు.

అంబర్‌పేట డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్, నాయకులు

పద్మారావుగౌడ్ గెలుపు ఖాయం

బాగ్‌అంబర్‌పేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దాసోజు శ్రావణ్

అంబర్‌పేట, మే 9 : సికింద్రాబాద్ ఎంపీగా పద్మారావుగౌడ్ గెలుపు ఖాయమని అంబర్‌పేట నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి దాసోజు శ్రావణ్ అన్నారు. పద్మారావుగౌడ్‌కు మద్దతుగా బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిడీపీరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్ తదితరులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు అందజేస్తూ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

మృతదేహం లభ్యం..

కవాడిగూడ, మే 9 : గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు దోమలగూడ పోలీసులు గురువారం తెలిపారు. ఎస్ఐ శాంతి తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 3వ తేదీన దోమలగూడ పోలీసులకు 100 నంబర్ నుంచి మృతదేహం పడి ఉందని సమాచారం అందింది. ఈ మేరకు హిమాయత్‌నగర్‌లోని లక్ష్మి హుండాయ్ షోరూం సమీపంలో ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని మృతదేహం పడివుంది. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బీఆర్ఎస్ అభ్యర్థి విజయం ఖాయం

గాంధీనగర్ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ముఠా జయసింహ

చిక్కడపల్లి, మే 9 : ప్రచారంలో ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ గెలుపు ఖాయమని బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ అన్నారు. పద్మారావుగౌడ్‌కు మద్దతుగా గురువారం సాయంత్రం పార్టీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. నాయకులు ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, శ్రీకాంత్, పున్న సత్యనారాయణ, ముఠా శివసింహ, ఈ. సాయి, హన్మంతు, జీవై గిరి, సుధాకర్, ఎసీ ప్రేమ్, ముచ్చకుర్తి పద్మ, వనజ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దు..

కవాడిగూడ : రాజకీయ లబ్ధికోసం బీజేపీ, కాంగ్రెస్ నేతలు చెపుతున్న మాయ మాటలు నమ్మి మోసపోవద్దని బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. గురువారం భోలక్‌పూర్‌లోని గుల్షన్‌నగర్, వెంకటేశ్వర కాలనీలో డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో పద్మారావు గౌడ్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. నాయకులు శంకర్ గౌడ్, మహ్మద్ అలీ, డివిజన్ ఎన్నికల ఇన్‌చార్జులు రాజాదీన్‌దయాల్‌రెడ్డి, సయ్యద్ అస్లాం, ఉమాకాంత్ ముదిరాజ్, కృష్ణ, మక్బూల్, జబ్బార్, సాయి కిరణ్ పాల్గొన్నారు.

అవకాశమిస్తే అభివృద్ధి చేస్తా..

బీఎస్పీకి ఓటు వేయాలని అభ్యర్థిస్తూ పాదయాత్ర చేస్తున్న ఆ పార్టీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి కేఎస్ క్రిష్ణ

సుల్తాన్‌బజార్, మే 9 : మత తత్వ పార్టీలు ఎంఐఎం, బీజేపీలతో హైదరాబాద్ అభివృద్ధి అసాధ్యమని బహుజన్ సమాజ్ పార్టీ హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి కేఎస్ క్రిష్ణ అన్నారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని పలు ప్రాంతాలలో బైక్ ర్యాలీలు, పాదయాత్రలు నిర్వహించి ఓటర్లను బీఎస్పీకి ఓటు వేసి ఆదరించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఎస్పీ హైదరాబాద్ ఇన్‌చార్జి పీవై గిరి, అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి బంగారి మానిక్‌రావు, కార్యదర్శి నాగరాజ్, మహిళా కన్వీనర్ రమాదేవి, చిత్రం సురేందర్, సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలి

సమావేశంలో మాట్లాడుతున్న కనకం కొమరెల్లి

చిక్కడపల్లి, మే 9 : గోపన్నపల్లిలోని ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని తెలంగాణ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కనకం కొమరెల్లి మాట్లాడుతూ.. జంటనగరాలలో పనిచేసే ఉద్యోగులు రిటైరయ్యే నాటికి స్వంత ఇల్లు ఉండాలన్న ఆలోచనతో 1985 లో చేసిన పోరాటాల ఫలితంగా 1991లో నాటి ప్రభుత్వం శేరిలింగంపల్లి గోపన్నపల్లిలో 427 ఎరాలు నాలుగు ప్రధాన ఉద్యోగ సంఘాల సభ్యులకు కేటాయించిందన్నారు. కొందరు స్వార్థపరులు కోర్టుకు వెళ్లినందుకు 2003 వరకు ప్లాట్ల పంపిణీపై ఎలాంటి పురోగతి లేదన్నారు. ప్రస్తుతం తమ సొసైటీ స్థలం ప్రభుత్వం అధీనంలో ఉన్నందున సమస్యను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్‌నాయకులు గోట్ల సూర్యకళ, వేణుగోపాల్ స్వామి, రామనాథం చెట్టి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

సుల్తాన్‌బజార్, మే 9: ఎన్నికల ప్రచారంలో భాగంగా హిందుత్వంపై, శ్రీరామ చంద్రుడు, సీతామాతలపై సీఎం హోదాలో ఉండి రేవంత్‌రెడ్డి విమర్శలు గుప్పించడాన్ని విశ్వ హిందూ పరిషత్ తప్పుపట్టింది. ఈ మేరకు గురువారం బీఆర్‌కె భవన్‌లో తెలంగాణ ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌కు వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి పండరీనాథ్,ఉపాధ్యక్షుడు జగదీశ్వర్, సహ కార్యదర్శి శశిధర్ తదితరులు సీఎం రేవంత్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారు.

గృహిణి అదృశ్యం

అదృశ్యమైన సంతోషిబాయి

కాచిగూడ, మే 9: తల్లి మందలించినందుకు గృహిణి అదృశ్యమైన ఘటన కాచిగూడ పరిధిలో జరిగింది. ఎస్సై పి.రవికుమార్ తెలిపిన ప్రకారం.. నింబోలిఅడ్డా ప్రాంతానికి చెందిన విజయ్‌సింగ్ భార్య సంతోషిబాయి (34) తరచుగా ఫోన్ మాట్లాడుతుంటే తల్లి సరస్వతి బాయి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన సంతోషిబాయి బుధవారం ఇంట్లోంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తల్లి కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తెల్ల రంగు పైజమా ధరించి, ఎత్తు 5.4 ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థిని..

తేజశ్రీ

అంబర్‌పేట, మే 9 : విద్యార్థిని అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై కృష్ణ తెలిపిన ప్రకారం.. అడిక్‌మెట్ అనూరాధ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న టి. సంపత్‌కుమార్ కూతురు తేజశ్రీ(21) డిప్లొమా పరీక్షలకు సిద్ధమవుతున్నది. ఈనెల 9న తెల్లవారుజామున 3.30కు సంపత్‌కుమార్ నీళ్లు తాగడానికి నిద్ర లేచాడు. ఆ సమయంలో కూతురు కనిపించలేదు. దీంతో నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉన్నది.

అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌కే పట్టం

- బీఆర్ఎస్ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్

అబిడ్స్, మే 9 : హైదరాబాద్ నగర అభివృద్ధికి పాటుపడిన బీఆర్ఎస్ పార్టీకే ప్రజలు పట్టం కడతారని ఆ పార్టీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. గోషామహల్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో శ్రీనివాస్‌యాదవ్ బైక్ ర్యాలీ నిర్వహించి ప్రచారం చేశారు. తెలంగాణ రాక ముందు హైదరాబాద్ ప్రజలు మంచినీటి కోసం అరిగోస పడే వారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక కోతలు లేని విద్యుత్‌ను అందించామని వివరించారు. అదేవిధంగా పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి మాజీ సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. దీంతో ప్రజలంతా తిరిగి బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టేందుకు సిద్ధమయ్యారని అన్నారు. తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని అన్నారు. ఈ ఎన్నికలలో బీఆర్ఎస్ 12 పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించడం ఖాయమన్నారు. పాతబస్తీలో ఎలాంటి అభివృద్ధి చేయని మజ్లిస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పి బీఆర్ఎస్‌ను గెలిపిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోషామహల్ నియోజకవర్గంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్, పార్టీ నాయకులు

శ్రీనివాస్‌యాదవ్‌ను గెలిపించుకుంటాం..

బీఆర్ఎస్ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ఆ పార్టీ నాయకులు బెజిని శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ ముఖేశ్ సింగ్ అన్నారు. గోషామహల్‌లోని బెజిని శ్రీనివాస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.. గోషామహల్ నియోజకవర్గానికి చెందిన గడ్డం శ్రీనివాస్ యాదవ్ హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీకి దిగడంతో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నదన్నారు. సమావేశంలో నాయకులు రాజా సింగ్, సలీం, క్రాంతి, సంజు, పాపాసింగ్, ప్రవీణ్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, పవన్ సింగ్, అమర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు బెజిని శ్రీనివాస్, ముఖేశ్‌సింగ్

కాంగ్రెస్, మజ్లిస్‌లను చిత్తుగా ఓడించండి..

అబిడ్స్, మే 9 : పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలను చిత్తుగా ఓడించాలని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షురాలు కాట్రగడ్డ ప్రసూన ప్రజలను కోరారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలలో ఆమె పర్యటించి బీజేపీకి మద్దతుగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి నలభై సంవత్సరాలుగా ప్రాతినిధ్యం వహిస్తూ వస్తున్న మజ్లిస్ పార్టీ ఎలాంటి అభివృద్ధి పనులను చేపట్టలేదని ఆరోపించారు. మైనార్టీలకు కల్లబొల్లి మాటలు చెప్పి రాజకీయ పబ్బం గడుపుకుంటోందన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల ద్వారా మైనార్టీలు కూడా లబ్ధి పొందుతున్నారని, మైనార్టీల అభ్యున్నతికి కూడా కేంద్ర ప్రభుత్వం పథకాలను ప్రవేశ పెట్టిందని తెలిపారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కొంపెల్లి మాధవీలతను, సికింద్రాబాద్ నుంచి జీ. కిషన్‌రెడ్డిని కుల, మత, రాజకీయాలకతీతంగా మద్దతు తెలిపి గెలిపించాలని ఆమె ప్రజలను కోరారు.

ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన

ప్రజా సమస్యలను విస్మరించిన కిషన్‌రెడ్డి

అబిడ్స్, మే 9 : సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న జి. కిషన్‌రెడ్డి ప్రజల సమస్యలను విస్మరించారని మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్ అన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని జంగంబస్తీలో ఇంటింటికీ తిరిగి దానం నాగేందర్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, త్యాగాల శివకుమార్, మంత్రి ముత్యాలు, భూపతి జయరాజ్ ఆదర్శ్‌కుమార్, గోనె రాకేశ్, పసుల గౌతం, బత్తుల రమేశ్‌రాజు, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆగాపురాలో మహారాణా ప్రతాప్ జయంతి

మహారాణా ప్రతాప్ జయంతి ఉత్సవాలను ఆగాపురాలో నిర్వహించారు. ఠాకూర్ రాజేందర్ సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాలలో భాగంగా ప్రతాప్ విగ్రహానికి బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు, నాయకులు ధీరేందర్‌సింగ్, ఠాకూర్ గణేశ్ సింగ్, ఠాకూర్ రంజిత్ సింగ్, రఘునందన్‌సింగ్, రాజేందర్ సింగ్, బజరంగ్ సింగ్ నివాళులర్పించారు. – అబిడ్స్, మే 9

రేషన్ బియ్యం పట్టివేత

కవాడిగూడ, మే 9: రేషన్ బియ్యం తరలిస్తూ పట్టుబడిన అక్రమార్కులపై దోమలగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం దోమలగూడ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ గిరి శ్రీకాంత్ తనిఖీలు చేపట్టారు. నంబర్ ప్లేట్‌లేని యాక్టీవా వాహనంపై ప్లాస్టిక్ సంచులతో వెళ్తున్న వాహనాన్ని ఆపి, పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నట్లుగా గుర్తించారు. పట్టుకున్న వ్యక్తి భోలక్‌పూర్‌కు చెందిన మహ్మద్ ఖలీద్ హుస్సేన్‌గా గుర్తించినట్లు తెలిపారు. అతను ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ముషీరాబాద్‌కు చెందిన ఫయాజ్ ఖాన్ గదిని తనిఖీ చేసి 41 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ బియ్యాన్ని పౌరసరఫరా శాఖకు అప్పగించినట్లు ఆయన వివరించారు.

ప్రతి పౌరుడూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

- డీఎంసీ మారుతి దివాకర్

గోల్నాక, మే 9 : ప్రతి పౌరుడూ ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఎంసీ మారుతిదివాకర్ కోరారు. గురువారం డీఎన్ సేవా సమితి అధ్యక్షుడు డీఎన్ నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో గురువారం గోల్నాకలో ఓటు హక్కుపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై.. ఓటు విలువను వివరించడంతో పాటు ఓటర్లకు అంబలి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్